

వైద్యవిద్య చేరువ - 8లో

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాలో ప్రభుత్వ వైద్యకళాశాలను ఏర్పాటుచేసింది. ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు వైద్య విద్యను చదువుకునే అవకాశం కల్పించింది.



మతసామరస్యానికి ప్రతీక ఈద్ మిలాద్ ఉన్ నబీ - 8లో

మతసామరస్యానికి ప్రతీకగా ఈద్ మిలాద్ ఉన్ నబీ పండగ అని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు.

నేడు విశ్వకర్మ జయంతి

పార్వతీపురం: విశ్వకర్మ జయంతి ఉత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, జిల్లా అధికారులు, బీసీ సంఘం నాయకులు 'విశ్వకర్మ జయంతి' ఉత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

న్యూస్‌రీల్

నేడు పాలకొండలో మెగా జాబ్‌మేళా

పార్వతీపురం: ఈ నెల 17న (మంగళవారం) పాలకొండ పట్టణంలో మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా పది, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్, ఎంఎస్సీ విద్యార్హతలు కలిగి, 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. జాబ్‌మేళా ఉదయం 9 గంటల నుంచి పాలకొండలోని శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాలలో జరుగుతుందని, ఈ మెగా జాబ్‌మేళాకు 16 కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని, 1050 పోస్టులు ఆయా కంపెనీలలో భర్తీ చేయనున్నారని తెలిపారు. మేళాలో పాసిసెట్టర్ బిజినెస్ సొల్యూషన్స్, ఆల్‌సెట్ బిజినెస్ సొల్యూషన్స్, ఎంఎన్‌సీ కంపెనీ, డెక్కన్ ఫైన్ కెమికల్స్, పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్, హెటిరో డ్రగ్స్, వింటా ల్యాబ్స్, వశిష్ఠ లైఫ్ సైన్సెస్, పేటీయం, అడికో, ముత్తూట్ ఫైనాన్స్, టీం లీడ్ (ఎస్‌బీఐకార్డ్స్), అపోలో ఫార్మశీ, నవత ట్రాన్స్‌పోర్ట్, ఫ్లిప్‌కార్ట్, కేఎల్ గ్రూప్-అమెజాన్ కంపెనీలు పాల్గొంటున్నాయని చెప్పారు. ఈ కంపెనీలు కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్, ప్రొడక్షన్ కెమిస్ట్, ట్రైనీ కెమిస్ట్, ట్రైనీ ఆపరేటర్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, పికింగ్ అండ్ ప్యాకింగ్, ప్రొబేషనరీ ఆఫీసర్, టెలికాలర్స్-ఎగ్జిక్యూటివ్, ఫార్మసిస్ట్, రిటైల్ ట్రైనీ అసోసియేట్, ఫార్మశీ అసిస్టెంట్, డ్రైవర్, క్లర్క్, వెహికల్ హెల్పర్ తదితర పోస్టులను భర్తీ చేయనున్నాయని వివరించారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను స్కిల్‌యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో విధిగా నమోదు చేసుకుని, రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్, ఒక పాస్‌ఫొటోతో ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా జరిగే ప్రదేశంలో హాజరుకావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు సెల్: 63012 75511, 79937 95796 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దైవసన్నిధిలో టీడీపీ కార్యకర్తల చిందులు

- తిరుపతిలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి భర్త, అనుచరుల హల్‌చల్



తిరుపతిలో డ్యాన్సు చేస్తున్న మంత్రి సంధ్యారాణి అనుచరులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఒకవైపు బుడమేరు వరదలో చిక్కుకొని విజయవాడ ప్రజలు విలవిలలాడుతుంటే రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి భర్త, అనుచరులు, టీడీపీ కార్యకర్తలు వేంకటేశ్వరస్వామి దైవ సన్నిధిలో నృత్యాలు చేస్తూ చిందులేస్తున్న వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల సంధ్యారాణి సిఫారసుతో పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గం నుంచి ఆమె భర్త జయకుమార్, వారి అనుచరులు, టీడీపీ కార్యకర్తలతో పాటు సాలూరులోని పలు పత్రికల విలేకరులు (సాక్షి కాదు) కూడా తిరుపతి వెళ్లారు. పద్మావతి అతిథిగృహంలో విడిది చేశారు. అక్కడే నాగిని డ్యాన్సులు మొదలెట్టారు. ఇప్పుడీ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దైవ దర్శనానికి వెళ్లినవారు నాగిని డ్యాన్సులు వేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చంద్రకళకు రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న మల్లా చంద్రకళ

విజయనగరం టౌన్: జిల్లాకు చెందిన మల్లా చంద్రకళకు ఏపీఎంపీఏ (ఆంధ్రప్రదేశ్ ఎంఈడీ ప్రోస్పరిటీస్ అసోసియేషన్) రాష్ట్రస్థాయి అవార్డు వరించింది. ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దయానందరెడ్డి చేతుల మీదుగా విజయవాడలో ఆదివారం ఆమె అవార్డు అందుకున్నారు. ఆమె ఆంధ్రాయూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగంలో ఇంగ్లిష్ బోధకురాలిగా పనిచేస్తున్నారు. ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ, ఒమ్మి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇందూ జ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధులు సోమవారం అవగాహన కల్పించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి ఊరేగింపు, విశిష్టతను ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలని కోరారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి జిల్లా కమిటీ అధ్యక్షుడు శంకర్, సభ్యులు ప్రసాద్, నాయుడు, రాజప్పడు పాల్గొన్నారు.

చిరుద్యోగులపై పసుపుతాస్త్రం!



కొత్త ప్రభుత్వం వచ్చింది.. మంచి చేస్తుందన్న నమ్మకం మూన్నాళ్లముచ్చటే అయ్యింది. తల్లికి వందనం, మత్స్యకార భృతి, రైతన్నకు పెట్టుబడి సాయం వంటి ప్రజాసంక్షేమ పథకాల అమలును పక్కనపెడితే చిరుద్యోగులపై 'పసుపు'తాస్త్రం వేస్తూ ఉద్యోగాల నుంచి తొలగించడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కొత్త ఉద్యోగాలు సృష్టించి.. నిరుద్యోగులకు ఉపాధిచూపకుండా ఉన్న ఉద్యోగాలను ఊడదీస్తుండడంపై నిరసన వెల్లువెత్తుతోంది. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ధర్నాలతో దద్దరిల్లుతోంది. ఆదుకోవాలంటూ అధికారులకు పెద్దఎత్తున అర్జీలు అందుతున్నాయి. కూటమి ప్రభుత్వం వేధింపులు, తొలగింపులకు గురైన గ్రామైక్య సంఘాల్లోని బుక్‌కీపర్ (వీవోఏ)ల గోడును ఒక్కసారి విందాం.

- వీవోఏలపై టీడీపీ నాయకుల ప్రతాపం
- ఏళ్ల తరబడి సేవలందిస్తున్నవారిని నిర్దయగా తొలగింపు
- తమవారికి ఆ పోస్టులు ఇప్పించుకునేందుకు కుట్ర
- వెలుగు అధికారులను బెదిరించి మరీ తెగింపు



పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వీవోఏలు, సీఐటీయూ నాయకులు (ఫైల్)

ఫిర్యాదు లేకపోయినా తప్పిస్తారంతే...



ఈమె పేరు గొర్లె సత్యవతి. చీపురుపల్లి మండలంలోని గొల్లలపాలెం వీవోఏగా గత ఏడేళ్ల నుంచి పనిచేస్తున్నారు. 21 స్వయం సహాయక సంఘాలకు పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్న ఆమెపై ఇప్పటివరకూ ఎలాంటి ఫిర్యాదు లేదు. అయినప్పటికీ ప్రభుత్వం మారగానే ఆమెను తప్పించేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నాలు మొదలెట్టారు. సంఘాల సభ్యులే కాదు ఆ గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు కూడా సత్యవతే వీవోఏగా ఉండాలని పట్టుబడుతున్నా తమ పంతం నెగ్గించుకోవాలని కుట్రలు చేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

అమలుకు సాధ్యంకాని అనేక హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించిన టీడీపీ నాయకులు.. తీరా అధికార పీఠం ఎక్కిన తర్వాత ప్రజలతో పాటు చిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. చేస్తున్నది చిన్న ఉద్యోగమే అయినా కొన్నేళ్లుగా దాన్నే నమ్ముకున్న పనిచేస్తున్నవారినీ నడిరోడ్డున పడేస్తున్నారు. ఆ బాధితుల జాబితాలో గ్రామైక్య సంఘాల వీవోఏ (బుక్ కీపర్)లు చేరారు. వారి పొట్టకొట్టి తమ అనుచరులు, తమకు కావాల్సినవారిని ఆ పోస్టుల్లో కూర్చోబెట్టడానికి కుట్రలు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేల అండతో చివరకు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నియోజకవర్గంలో కూడా గ్రామైక్య సంఘాల వీవోఏలను అకారణంగా తొలగించేస్తున్నారు. తొలగించకపోతే వేరేచోటకు బదిలీ చేయిస్తామంటూ గ్రామ, మండలస్థాయి టీడీపీ నాయకులు వెలుగు అధికారులను బెదిరిస్తున్నారు. వారి భుజాలపై తుపాకీ పెట్టి తమకు కావాల్సిన పని చేయించుకుంటున్నారు.

గ్రామస్థాయిలో కీలక బాధ్యతలు...

గ్రామ స్థాయిలో పది నుంచి 20 డ్వాక్రా సంఘాల సమూహంగా ఉండే ప్రతి గ్రామైక్య సంఘానికి ఒక వీవోఏ ఉంటారు. నెలకు రూ.8వేలు చొప్పున గౌరవ వేతనం వస్తుంది. ఇప్పుడీ ప్రభుత్వం ఆ మొత్తాన్నీ నేరుగా వారి ఖాతాల్లో జమ చేయడం లేదు. గ్రామైక్య సంఘాల ఖాతాల్లో జమచేస్తే ఆ సంఘ అధ్యక్షులు వారికి చెల్లిస్తారు. ఎప్పుడైనా ఆ వీవోఏను తొలగించాలంటే ఆ సంఘాలే తీర్మానం చేయాలి. వాస్తవానికి డ్వాక్రా సంఘాలు స్వతంత్రంగా వ్యవహరించే అధికారం ఉన్నప్పటికీ వీటిలో సభ్యులుగా ఉన్న పింఛన్‌దారులు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు టీడీపీ నాయకుల హెచ్చరికలకు భయపడుతున్నారు. వారిని ఎదిరిస్తే ఎక్కడ తమకు పథకాలు అందవోనన్న భయంతో వారి చెప్పినదానికల్లా తలూపుతున్నారు. దీంతో పలుచోట్ల వీవోఏలను తొలగించడానికి తీర్మానాలు చేసేస్తున్నారు. ఈ ప్రక్రియ తమకు అనుకూలంగా జరిగేలా వెలుగు అధికారులనూ టీడీపీ నాయకులు బెదిరించడం గమనార్హం. కొన్నిచోట్ల తీర్మానాలు లేకుండానే మండల ఏపీఎంలపై ఒత్తిడి పెంచి వీవోఏలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రెండు జిల్లాల్లోనూ ఇదే తంతు...

- విజయనగరం మండల పరిధిలో జొన్నవలస గ్రామానికి చెందిన వీవోఏ సత్యవతిని తప్పించి ఆమె స్థానంలో టీడీపీ సానుభూతిపరురాలైన కృష్ణవేణిని గత నెల 22న నియమించారు.
- పూసపాటిరేగ మండలంలో తాళ్లపేట, కొల్లాయివలస, పూసపాటిరేగ వీవోఏలను తొలగించాలని తీర్మానాలు చేయించారు. భోగాపురం, డెంకాడ మండలాల్లోనూ వీవోఏలపై కత్తి వేలాడదీశారు.
- గంట్యాడ మండలం పెదవేమలి గ్రామంలో వీవోఏ పి.స్వాతిని తొలగించి ఆమె స్థానంలో టీడీపీ మద్దతుదారురాలిని పెట్టించారు. దత్తిరాజేరు మండలం ఎం.లింగాలవలస గ్రామంలో వీవోఏనూ తొలగించడానికి ఆమెపై పలు ఆరోపణలు చేస్తున్నారు.
- రాజాం మండలంలో ఇద్దరు, వంగరలో ఇద్దరు, రేగిడిలో ఒక వీవోఏను తొలగించారు.
- చీపురుపల్లి నియోజకవర్గంలో కొత్త అగ్రహారం, పత్తికాయవలస, గొల్లలపాలెం గ్రామాల్లో వీవోఏలుగా పనిచేస్తున్నవారిని తొలగించి కొత్తవారిని నియమించారు. ఈ కొత్త వారంతా టీడీపీ మద్దతుదారులే.
- ఎస్.కోట మండలానికి సంబంధించి సీతారాంపురం వీవోఏ ధనలక్ష్మి, క్రిష్టాపురం గ్రామానికి చెందిన అరుణ, తిమిడి గ్రామానికి చెందిన లలిత, వసి గ్రామానికి చెందిన జి.త్రివేణి, వీరనారాయణం గ్రామానికి చెందిన లక్ష్మి, శివరామరాజుపేట గ్రామానికి చెందిన దేవీలను వీవోఏ పోస్టు నుంచి తొలగించారు. వేపాడ మండలంలో కరకవలస వీవోఏ ముచ్చకర్ల సంధ్య, పాటూరు వీవోఏ లక్ష్మి, ఆతవ వీవోఏ జ్యోతి, శింగరాయి వీవోఏ గుల్లిపల్లి సత్యవతి, వావిలపాడు వీవోఏ నాడు కాత్యాయినిలను అకారణంగా తొలగించారు.
- మెంటాడ మండలంలో పిట్టాడ, కూనేరు, లక్ష్మీపురం, లోతుగెడ్డ వీవోఏలను టీడీపీ నాయకుల ప్రోద్బలంతో ఏపీఎం తొలగించేశారు.
- జియ్యమ్మవలస మండలంలో ఎంపీపీ ఒత్తిళ్లకు లొంగి వెలుగు అధికారులు తొమ్మిది మంది వీవోలను తప్పించారు. పార్వతీపురం మండలం ఎంఆర్ నగరంలో గజవదన గ్రామైక్య సంఘం వీవోఏగా డొంకాడ మహేశ్వరరావు ఏడేళ్లుగా పనిచేస్తున్నారు. గ్రామసర్పంచ్ భర్త ఒత్తిడితో ఆయనను పక్కనపెట్టారు. ఇదే పరిస్థితి జిల్లాలో చాలాచోట్ల ఉంది. గుట్టుచప్పుడు కాకుండా వీవోఏల పొట్టకొడుతున్నారు.

అన్యాయంగా తొలగించారు...



నా భర్త దళాయిపేట ప్రాదేశికానికి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడిగా ఉన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక కక్ష కట్టి నన్ను వీవోఏ బాధ్యతల నుంచి అన్యాయంగా తొలగించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను.

– ముంజి స్వర్ణ కుమారి, దళాయిపేట, కొమరాడ మండలం

నేటి నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

- ఈనెల 17, 18 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా కాంప్లెక్స్ సమావేశాలు
- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా విద్యాశాఖ
- సబ్జెక్టు వారీగా సమావేశాల నిర్వహణ



స్కూల్ కాంప్లెక్స్ సమావేశం (ఫైల్)

వీరఘట్టం: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఈ నెల 17, 18 తేదీల్లో ప్రతి రెండు లేదా మూడు మండలాల సబ్జెక్టు టీచర్లకు ఒకే చోట కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి సబ్జెక్టు బోధనలో మెలకువలతో పాటు విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడమే సమావేశాల లక్ష్యంగా పేర్కొంది.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను పక్కాగా నిర్వహించాలి



స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను కాంప్లెక్స్ చైర్మన్ల ఆధ్వర్యంలో పక్కాగా నిర్వహించాలి. బోధనలో మెలకువలపై చర్చాగోష్టి నిర్వహించాలి. తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించడంతో పాటు వారికి ప్రత్యేక తరగతుల నిర్వహణపై చర్చించాలి. పదోతరగతి విద్యార్థులపై సబ్జెక్ట్ టీచర్లు దృష్టి సారించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

– జి.పగడాలమ్మ, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

గిరిజన మహిళా ఎంపీటీసీపై టీడీపీ నాయకులదాడి

- కులంపేరుతో దూషిస్తూ చితకబాదిన వైనం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు
- డీజే శబ్దం భరించలేక చిత్రస్టాలిన్ అనే మహిళ డయల్-100కు ఫిర్యాదు
- వైఎస్సార్‌సీపీ నాయకులే ఫిర్యాదు చేశారన్న అనుమానంతో దాడిచేసిన వైనం



గాయాలతో సాలూరు ప్రభుత్వాస్పత్రిలో చేరిన మరిపల్లి ఎంపీటీసీ సభ్యురాలు సీతారాం

సాలూరు రూరల్: మండలంలోని మరిపల్లి పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. గిరిజన మహిళా ఎంపీటీసీ సభ్యురాలు జన్ని సీతారాం, ఆమె మేనల్లుడు బోను వెంకటేష్‌పై మూకుమ్మడిగా దాడిచేశారు. కులం పేరుతో దూషిస్తూ చితకబాదడంతో బాధితులిద్దరూ సాలూరు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. స్థానికుల వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి టీడీపీ వర్గీయులు ఏర్పాటుచేసిన వినాయక విగ్రహ నిమజ్జనం జరిగింది. పోలీస్ నిబంధనలకు విరుద్ధంగా డీజేను ఏర్పాటు చేశారు. పెద్దపెద్ద శబ్దాలకు జనం ఇబ్బందులు పడ్డారు. గుండెపోటు వచ్చే ప్రమాదం ఉండడంతో గ్రామానికి చెందిన సుబ్బారావు కుమార్తె జత్తాసు చిత్ర స్టాలిన్ డయల్-100కి ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పోలీసులు వినాయక నిమజ్జనం వద్దకు వచ్చి ఫిర్యాదు వచ్చిందని, డీజే శబ్దం తగ్గించాలని వినాయక కమిటీ సభ్యులకు సూచించారు. దీనిని మనసులో పెట్టుకొని రామమందిరం వద్ద వినాయక విగ్రహం వద్దకు చేరుకోగానే బానాసంచా అడ్డదిడ్డంగా వెలిగించి అక్కడ వినాయకుడి మండపంలోకి తారాజువ్వలు దొచ్చు కొనేలా టీడీపీ వర్గీయులు వ్యవహరించారు. దీనిపై ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు సీతారాం, మేనల్లుడు బోను వెంకటేష్‌పై తొలుత టీడీపీ నాయకులు కొనిబోయిన వెంకటరమణ, శీతంనాయుడు దాడిచేశారు. బోను కృష్ణవేణి, బోను హిందులు కలిసి ఎంపీటీసీ జుట్టు పట్టుకొని ఈడ్చుకుపోయారు. కసినబోయిన వినయ్, వెంకటరమణ, సీతంనాయుడు కూడా దాడి చేసినట్టు ఎంపీటీసీ సభ్యురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ దాడిలో బంగారు ఆభరణాలు పోయినట్టు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేశామన్న అనుమానంతో దాడిచేశారని, గతంలో కూడా దాడికి పాల్పడిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. ఎంపీటీసీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసును సాలూరు పోలీసులు నమోదు చేశారు. టీడీపీ నాయకుల ఫిర్యాదుపై విచారణ చేస్తున్నారు.

ఏపీఏఈఎస్ జిల్లా అధ్యక్షుడిగా సత్యనారాయణ



సత్యనారాయణకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

చీపురుపల్లి: ఏపీ వ్యవసాయ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా చీపురుపల్లి పట్టణానికి చెందిన ఇజ్జిరోతు సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని ఏపీ వ్యవసాయ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయి, రాష్ట్ర కార్యదర్శి రవిల చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా అసోసియేషన్ ఎన్నికల సందర్భంగా స్థానిక వ్యవసాయ శాఖ సబ్ డివిజనల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఇజ్జిరోతు సత్యనారాయణను జిల్లా అధ్యక్షుడిగా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్.రామారావు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా ఈ.సత్యారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా ఎం.వెంకటనాయుడు, వి.రమేష్, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా పాపారావు వ్యవహరించారు.

సామాన్యుల బండికి ఎర్ర జెండా!

- పార్వతీపురం మీదుగా వందేభారత్
- పాసింజర్ సర్వీసులు పెంచాలని ఎప్పటినుంచో కోరుతున్న జిల్లా ప్రజలు
- ఉన్న రైళ్లు, బోగీలు తగ్గించడంతో ప్రయాణానికి ఇక్కట్లు



సాక్షి, పార్వతీపురం మన్యం:

ప్రజాప్రతినిధుల చొరవతో పార్వతీపురంలో వందేభారత్ రైలుకు హాల్టు లభించింది. ఈ రైలు సగర్వంగా సోమవారం సాయంత్రం ఇక్కడ ప్రారంభమైంది. రైలు కూత వినపడడం పట్ల కొంత మేర హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నప్పటికీ.. సామాన్య ప్రజానీకానికి టికెట్ ధరలు అందుబాటులో ఉండకపోవడంపై పెదవి విరుపే ఎక్కువగా ఉంది. ఇదే సమయంలో అతి రద్దీ మార్గాల్లో ఒక్కటైన విజయనగరం-బొబ్బిలి-పార్వతీపురం-రాయగడకు అదనపు పాసింజర్ సర్వీసులు కావాలని ఎప్పటినుంచో స్థానిక ప్రజల నుంచి డిమాండ్ ఉంది. దీనిని రైల్వే అధికారులు పరిగణనలోకి తీసుకోవడం లేదు. పైగా ఉన్న సర్వీసులను రద్దు చేయడం.. కొన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు స్లీపర్‌క్లాస్ బోగీలు తగ్గించేయడంతో ప్రయాణికులు మరింత ఇబ్బందులు పడుతున్నారు.

నిత్యం వేలాది మంది రాకపోకలు

ప్రతిరోజూ పార్వతీపురం-విజయనగరం-విశాఖల మధ్య విద్య, ఉద్యోగ, వ్యాపార, వైద్యం నిమిత్తం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. మన్యం జిల్లా కేంద్రం ఏర్పడిన తర్వాత విశాఖ, విజయనగరంల నుంచి రాకపోకలు సాగించే ఉద్యోగుల సంఖ్య మరింత పెరిగింది. వీరందరూ సకాలంలో ఉద్యోగాలకు గానీ, ఇతర వ్యాపార, విద్య అవసరాలకు గానీ కొరాపుట్ డీఎంయూ/రాయిపూర్ రైలు ఒక్కటే ఆధారం. కొద్దిరోజులుగా అది కూడా గంటల తరబడి ఆలస్యం కావడం, సకాలంలో చేరకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో విశాఖ నుంచి రాయపూర్ వెళ్లే పాసింజర్ విశాఖలో ఉదయం 4 గంటలకు బయల్దేరేది. ప్రస్తుతం ఆ రైలును ఉదయం 6.30కి విశాఖలో బయల్దేరే కొరాపుట్ డీఎంయూకు లింకు చేశారు. అప్పటి నుంచి ప్రయాణికుల కష్టాలు రెట్టింపయ్యాయి. ఆ రైలు కొన్ని సందర్భాల్లో పార్వతీపురం చేరుకునే సరికే 11.30 దాటిపోతోంది. ఇదే రైలులో రాయగడ అమ్మవారి దర్శనానికి కూడా చాలా మంది వెళ్తుంటారు. వారికి కూడా ఈ సమయం ఉపయుక్తంగా ఉండడం లేదు. రాయపూర్ రైలును పాత సమయంలోనే కొనసాగించాలని, వారానికి రెండు రోజులు ఈ మార్గంలో తిరిగే ఇంటర్‌సిటీని ప్రతిరోజూ నడపాలని.. విశాఖపట్నం నుంచి విజయనగరం వరకు నడిచే 'మెము' సర్వీసును రాయగడ వరకు పొడిగించాలని జిల్లా ప్రజలు ఎప్పటినుంచో కోరుతున్నారు. దీంతో పాటు.. 'మెము' సర్వీసును సాలూరు వరకు నడపాలన్న విజ్ఞప్తులూ ఉన్నాయి. ఇవేవీ కార్యరూపం దాల్చడం లేదు. దీనికితోడు పార్వతీపురం స్టేషన్ మీదుగా వెళ్లే విశాఖ (బెనారస్), ఎర్నాకుళం వంటి ఎక్స్‌ప్రెస్ సర్వీసుల స్లీపర్ క్లాస్ బోగీలను తగ్గించేశారు. దీంతో సాధారణ ప్రయాణికులకు ఇబ్బంది తప్పడం లేదు. రాయగడ-గుంటూరు సర్వీసు ఎప్పుడు నడుస్తుందో, ఎప్పుడు ఆగిపోతుందో రైల్వే అధికారులకే స్పష్టత లేదు. దీన్ని ప్రయాణికులు నమ్మడమే మానేశారు. ఫలితంగా ఆయా సర్వీసుల్లో కిక్కిరిసి ప్రయాణం చేయాల్సి వస్తోంది. సాయంత్రమైతే జిల్లా కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. అటు సరిపడా రైళ్లు లేక, ఇటు ఆర్టీసీ బస్సులు అంతంతమాత్రంగానే ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వందేభారత్ వంటి సర్వీసులను ప్రోత్సహిస్తూనే.. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా పాసింజర్, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను పెంచాలని జిల్లావాసులు కోరుతున్నారు.

సామాన్యులకు అందుబాటులో ఉండే సర్వీసులను నడపాలి

వందేభారత్ వంటి రైళ్లు సామాన్య ప్రజలకు ఉపయోగకరంగా ఉండవు. నిత్యం ఇక్కడ నుంచి విద్య, వైద్యం, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం వేలాది మంది ప్రయాణిస్తుంటారు. వారందరికీ అతి తక్కువ చార్జీలతో 'మెము' వంటి సర్వీసులు నడపాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. రాయగడ డీఎంయూ-రాయపూర్ రైలు కూడా సమయానికి తిరగడం లేదు. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– కొల్లి సాంబమూర్తి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు

ఆంధ్రప్రదేశ్‌కు ముఖద్వారం పార్వతీపురం

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

పార్వతీపురం: ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతం కాదని, ఆంధ్రప్రదేశ్‌కు ముఖద్వారంగా తీర్చిదిద్దుతామని కేంద్ర విమానాయనశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. వందేభారత్ రైలు ప్రారంభోత్సవంలో భాగంగా విశాఖపట్నం నుంచి పార్వతీపురం వచ్చిన రైలు బెలగాం రైల్వే స్టేషన్‌లో సోమవారం ఆగింది. రైలులో వచ్చిన ఆయన అక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడారు. వందేభారత్‌కు పార్వతీపురంలో హాల్టు కల్పించడం వల్ల ఈ ప్రాంతీయుల ఆకాంక్ష నెరవేరిందన్నారు. ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి జంఝావతి ఆయకట్టు రైతుల సాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. విశాఖ జోన్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ చేశామని, కొద్దిరోజుల్లో అధికారికంగా విశాఖజోన్ ఏర్పాటుకు భూమిపూజ చేస్తామని చెప్పారు. మరో 18 నెలల్లో భోగాపురం విమానాశ్రయం ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. గిరిజనులు, రైతులు తయారుచేసిన ఉత్పత్తులకు అవసరమైన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో విశాఖపట్నం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ గౌరీశ్వరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు


సాధించిన పతకాలతో జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. ఈనెల 13,14,15 తేదీల్లో అమలాపురం కోనసీమ జిల్లాలో జరిగిన పోటీల్లో జిల్లా పరిషత్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న ఎస్.రామకృష్ణ 74 కేజీల విభాగంలో ఒక బంగారు, ఒక కాంస్య పతకం, కె.జగదీష్ 59 కేజీల విభాగంలో ఒక బంగారు, ఒక కాంస్య పతకం, ఎ. రాజా 69కేజీల విభాగంలో ఒక బంగారు, ఒక కాంస్య పతకం సాధించారు. మాస్టర్స్ విభాగంలో ఎం.గోపీకృష్ణ ఒక వెండి, ఒక కాంస్య పతకం చేజిక్కించుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను కోడి రామమూర్తి వ్యాయమ సమాజం ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

బొబ్బిలి: పట్టణంలోని రెడ్డిక వీధికి చెందిన జామి అప్పారావు(40) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం జరిగిన ఈ ఘటనపై సీఐ కె.సతీష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అప్పారావు తాగుడుకు బానిసై ఇంట్లోని సామగ్రి అమ్మి మరీ తాగుతున్నాడు. ఈ నేపథ్యంలో భార్య ఆదిలక్ష్మి అప్పారావును మందలించి పట్టణంలోని కోరాడ వీధిలో ఉన్న కన్నవారింటికి ఆదివారం వెళ్లిపోయింది. సోమవారం ఉదయం అప్పారావు ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని ఇంటి యజమాని గమనించి ఆదిలక్ష్మికి సమాచారమందించారు. దీంతో ఆమె వచ్చి చూడగా సీలింగ్ రాడ్‌కు ఉరి వేసుకుని భర్త చనిపోయి ఉన్నాడు. ఫిర్యాదు మేరకు ఎస్సై టి.శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని మహిళ..



విజయనగరం క్రైమ్: సహజీవనం చేస్తున్న వ్యక్తి పెడుతున్న టార్చర్ భరించలేక ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి రూరల్ పోలీసులు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలూరులో అగ్రికల్చర్ విభాగంలో ఏఈఓగా పనిచేస్తున్న రెడ్డి హైమావతి (34)కి 2009లో పెళ్లయింది. కానీ 2014లోనే భార్యాభర్తలు విడిపోయారు. వారికి బాబు, పాప ఉన్నారు. నాటి నుంచి పిల్లలతో సాలూరులోనే ఆమె నివసిస్తోంది. భర్తతో విడాకుల అనంతరం ఆమె తమ కుటుంబానికి చెందిన నల్లగోపి అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఆమె పదేళ్ల క్రితమే విజయనగరంలోని రామానారాయణం ప్రాంతంలో అపార్ట్‌మెంట్ కొనుగోలు చేసింది. రెండేళ్ల క్రితం సాలూరు నుంచి ఆమె షిఫ్ట్ అయి విజయనగరంలో ఉంటుండగా పిల్లలు విశాఖలో చదువుతున్నారు. సహజీవనం చేస్తున్న గోపికి హైమావతి మరో వ్యక్తితో మాట్లాడుతోందనే అనుమానం మొదలై రోజురోజుకూ పెనుభూతంగా మారింది. దీంతో నిత్యం ఆమెను టార్చర్ పెట్టడం, ఇబ్బందులకు గురిచేయడం ప్రారంభించాడు. అదే తరహాలో ఆదివారం కూడా ఆమెను ఇబ్బంది పెట్టడంతో మనస్తాపం చెందిన హైమావతి జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే సీలింగ్‌ఫ్యాన్ హుక్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యులు, స్థానికులందించిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై వి.అశోక్ కుమార్ తెలిపారు.

కోనేరులో పడి ఒకరి మృతి

పార్వతీపురం: మండలంలోని నర్సిపురం గ్రామంలో మంచినీటి కోనేరులో ఆదివారం రాత్రి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. సోమవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై ఎస్సై దినకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వైకేఎం నగర్‌కు చెందిన కునుకు రాం ప్రసాద్ (34) తన స్నేహితుడి ఇంటికి వెళ్లి గ్రామంలో నిర్వహించిన గణేష్ నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్నాడు. అనంతరం కాలకృత్యాల నిమిత్తం గ్రామ సమీపంలోని మంచినీటి కోనేరుకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి మృతి చెందాడు. సోమవారం మధ్యాహ్నం అటుగా వెళ్లిన పలువురికి రాంప్రసాద్ చెరువులో విగతజీవిగా కనిపించాడు. దీంతో వారు పోలీసులకు, మృతుడి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలంలో పరిశీలించి మృతదేహానికి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు బైక్ మెకానిక్. భార్య, తల్లిదండ్రులు, పిల్లలున్నారు.

జుడో క్రీడాకారుల ఎంపిక రేపు

బొబ్బిలి: ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జుడో పోటీల్లో పాల్గొనేందుకు బాలబాలికల ఎంపిక పోటీలను ఈనెల 18 ఉదయం 9 గంటల నుంచి రామభద్రపురం మండలంలోని కొట్టక్కి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు అండర్ 17,14 స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి కృష్ణంరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వివరాలకు సెల్ 94401 27587 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹204

వైద్యవిద్య చేరువ

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే జిల్లాలో వైద్యకళాశాల ఏర్పాటు
- 150 మందికి వైద్యవిద్యను అభ్యసించే అవకాశం
- సెకెండ్ ఇయర్‌లోకి అడుగుపెడుతున్న విద్యార్థులు
- వైద్యకళాశాల ఏర్పాటుతో చదువుకు అవకాశం అంటున్న విద్యార్థులు
- ప్రస్తుత కూటమి ప్రభుత్వ తీరుపై ఆందోళన



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విజయనగరంలో ఏర్పాటుచేసిన ప్రభుత్వ వైద్య కళాశాల

విజయనగరం ఫోర్ట్:

వైద్య విద్య.. ధనవంతుల పిల్లలకే అన్న నానుడి ఉండేది. వైద్య కళాశాలలు తక్కువగా ఉండడం, సీట్లు పరిమితంగా ఉండడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు వైద్యవిద్య అందని ద్రాక్షగా మారేది. ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు లభించక, ప్రైవేటు వైద్య కళాశాలల్లో చదివే ఆర్థికస్థోమత లేక ర్యాంకు వచ్చినా చాలామంది విద్యార్థులు సీట్లు వదులుకునేవారు. మంచి ర్యాంకు సాధన కోసం ఏళ్ల తరబడి శ్రమించేవారు. ఈ పరిస్థితిని గమనించిన గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో 17 వైద్య కళాశాలల మంజూరుకు కృషిచేసింది. అందులో తొలివిడతగా మంచిలీపట్నం, నంద్యాల, ఏలూరు, రాజమండ్రి, విజయనగరంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను నిర్మించింది. ప్రవేశాలు సైతం కల్పించింది. మొదటి ఏడాది వైద్యవిద్యను పూర్తిచేసిన విద్యార్థులు ఈ ఏడాది రెండో ఏడాదిలోకి అడుగు పెడుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్యకళాశాలలు వద్దంటూ జాతీయ వైద్యకమిషన్‌కు లేఖరాయడం, ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రైవేటు పరం చేసేయత్నాలపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. వైద్యవిద్యకు నాటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి, నేటి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై చర్చజోరందుకుంది.

రాష్ట్ర వ్యాప్తంగా 750 మందికి ప్రవేశాలు

రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలు అందుబాటులోకి రావడం వల్ల 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. విజయనగరం జిల్లాకు సంబంధించి 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు కావడం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్య భాగ్యం కలిగింది. గతంలో ప్రైవేటు వైద్య కళాశాలలు అధికంగా ఉండడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు వైద్య విద్యను చదువుకోలేకపోయేవారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను అధికంగా అందుబాటులోకి తేవడం వల్ల ఎక్కువ మందికి వైద్య విద్యను అభ్యసించే అవకాశం లభించింది.

కార్పొరేట్ కంటే మిన్నగా వసతుల కల్పన

కార్పొరేట్ మెడికల్ కాలేజీలు కంటే మిన్నగా ప్రభుత్వ వైద్యకళాశాలల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వసతులు కల్పించింది. విద్యార్థుల చదువుకు అవి దోహదపడుతున్నాయి. విజయనగరం ప్రభుత్వ వైద్యకళాశాలలో మొదటి ఏడాది విద్యార్థుల కోసం నిర్మించిన హిస్టలాజీ, బయోకెమిస్ట్రీ, అనాటమీ, ఫిజియాలజీ ల్యాబ్‌లు, అందులో వసతులు అద్భుతంగా ఉన్నాయని విద్యార్థులే ప్రశంసిస్తున్నారు. ఆహ్లాదకర వాతావరణంలో వైద్య విద్యను అభ్యసిస్తున్నామంటూ ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుతో సీటు వచ్చింది



రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలలు అందుబాటులోకి రావడం వల్ల నాకు ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు వచ్చింది. వైద్య కళాశాలలు రాకుండా ఉండి ఉంటే మాలాంటి వారికి సీటు రావడం కష్టం. మొదటి ఏడాది పూర్తయింది. రెండో ఏడాదిలోకి అడుగు పెడుతున్నాను. ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు రావడం చాలా సంతోషంగా ఉంది.

– మనస్విని బడగల, వైద్య విద్యార్థిని, ప్రభుత్వ వైద్య కళాశాల, విజయనగరం

మొదటి ఏడాది పూర్తయింది..



మొదటి ఏడాది ఎంబీబీఎస్ పూర్తయింది. రెండో ఏడాదిలోకి అడుగుపెడుతున్నాను. వైద్య కళాశాలలో వసతులు అద్భుతంగా ఉన్నాయి. ఎంతో అనుభవం గల ప్రొఫెసర్లు ఉన్నారు. తోటి విద్యార్థులతో స్నేహపూర్వక వాతావరణం ఉంది. ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు కావడం వల్ల వైద్యవిద్య సామాన్య, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారికి అందుబాటులోకి వచ్చింది.

– ఎ.హారిక, వైద్య విద్యార్థిని, ప్రభుత్వ వైద్య కళాశాల, విజయనగరం

గర్వంగా ఉంది



ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు రావడం గర్వంగా ఉంది. గత ప్రభుత్వం వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడం వల్ల నాకు ఎంబీబీఎస్ సీటు వచ్చింది. ఆహ్లాదకర వాతావరణంలో మొదటి ఏడాది పూర్తి చేశాను. రెండో ఏడాదిలోకి అడుగు పెడుతున్నాను. విద్యా బోధన చాలా బాగుంది.

– టి.రిషిచంద్ర, వైద్య విద్యార్థి, ప్రభుత్వ వైద్య కళాశాల, విజయనగరం

రాష్ట్ర స్థాయి పోటీలకు చీపురుపల్లి ఉపాధ్యాయుల టీం


జిల్లా స్థాయిలో విజయం సాధించిన చీపురుపల్లి ఉపాధ్యాయుల జట్టు

చీపురుపల్లి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) స్వర్ణోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో చీపురుపల్లి మండల ఉపాధ్యాయుల జట్టు విజయం సాధించింది. జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా మైదానంలో సోమవారం యూటీఎఫ్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో చీపురుపల్లి, గజపతినగరం మండలాలకు చెందిన ఉపాధ్యాయుల జట్లు తలపడ్డాయి. అందులో చీపురుపల్లి జట్టు విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలవడమే కాకుండా రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. దీంతో అక్టోబర్ 4, 5, 6 తేదీల్లో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున చీపురుపల్లి ఉపాధ్యాయుల జట్టు పాల్గొననుంది. జిల్లా స్థాయిలో విజయం సాధించిన చీపురుపల్లి జట్టుకు యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కూడా విజయం సాధించాలని కోరారు. జిల్లా స్థాయిలో విజయం సాధించిన చీపురుపల్లి జట్టుకు కెప్టెన్‌గా పిసి.స్వరూప్, వైస్ కెప్టెన్‌గా బాసిన సతీష్, వికెట్ కీపర్‌గా ఏవీఆర్‌డీ.ప్రసాద్‌లు వ్యవహరించారు.

బొలెరో ఢీకొని మహిళ మృతి


సరస్వతి మృతదేహం

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్ అగ్రహారం జంక్షన్ సమీపంలో జాతీయరహదారిపై సోమవారం సాయంత్రం బొలెరో వాహనం ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లా పరవాడ మండలం గొర్లె వానిపాలెం గ్రామానికి చెందిన మిరయాల సరస్వతి (51) శ్రీకాకుళం జిల్లా రణస్థలం వెళ్లి తిరుగుప్రయాణంలో సీహెచ్ అగ్రహారం జంక్షన్ సమీపంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి రహదారి దాటుతుండగా మితిమీరిన వేగంతో వచ్చిన బొలెరో వాహనం బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం మేరకు సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛత జీవన విధానం కావాలి

- నేటినుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత కార్యక్రమాలు
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: మహాత్మా గాంధీ వారసత్వాన్ని గౌరవిస్తూ, స్వచ్ఛతను మన జీవన విధానంగా మార్చుకునేలా సమష్టిగా ముందడుగు వేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. స్వచ్ఛభారత్ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ-2024 కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం సంబంధిత జిల్లా అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. స్వచ్ఛభారత్ మిషన్ పదో వార్షికోత్సవం, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందని అభిప్రాయపడ్డారు. మహాత్ముడి జయంతి వేళ ప్రతి సంవత్సరం అక్టోబర్ 2వ తేదీని స్వచ్ఛభారత్ దివస్‌గా పాటిస్తున్నామని గుర్తు చేశారు. 'స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత' ఇతివృత్తంగా స్వచ్ఛతా హి సేవ 2024ను నిర్వహించుకోనున్నట్లు వివరించారు. జిల్లా అంతటా పరిశుభ్రతకు సంబంధించిన కార్యకలాపాల్లో సమష్టి కార్యాచరణ, పౌరులలో భాగస్వామ్య స్ఫూర్తిని పునరుద్ధరించడమే ధ్యేయంగా ముందడుగు వేయాలని అధికారులకు సూచించారు. సమాజం మొత్తాన్ని భాగస్వాములను చేసేలా పక్షం రోజుల పాటు మూడు ప్రధాన అంశాలపై ఆధారపడి కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. స్వచ్ఛతా కీ భాగీదారి విభాగంలో తగిన ప్రచారంతో ప్రజల భాగస్వామ్యాన్ని, అవగాహనను ప్రోత్సహించడానికి మారథాన్‌లు, సైక్లోథాన్‌లు, మానవహారాలు నిర్వహించాలని సూచించారు. మొక్కల పెంపకంతో పాటు ఇతర సుందరీకరణ పనులు చేపట్టవలసి ఉందన్నారు. స్వచ్ఛత లక్షిత్ ఏకాయి-సంపూర్ణ స్వచ్ఛత విభాగంలో అధిక జనసాంద్రత కలిగిన ప్రదేశాలలో సామూహిక పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతూ, పరిశుభ్రత లక్ష్య సాధన కోసం ప్రత్యేకించి ఒక ప్రాంతాన్ని లేదా పారిశుధ్య సమస్యను ఎంపిక చేసుకుని దానికి పరిష్కారాన్ని చూపాలని పేర్కొన్నారు. సఫాయి మిత్ర సురక్ష విభాగంలో పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమం, గౌరవాన్ని కాపాడేలా విభిన్న కార్యక్రమాలు చేపట్టాలని, ఆరోగ్య శిబిరాల నిర్వహణ, సంక్షేమ పథకాల లబ్ధికి ఏకగవాక్ష విధానాన్ని అమలు చేయడం తదితర అంశాలను చేపట్టాలని కోరారు. వారికి ప్రత్యేకంగా భద్రతా శిక్షణ, పీపీఈ కిట్లు అందజేయాలని పేర్కొన్నారు. పరిశుభ్రతను కాపాడే క్రమంలో పౌర భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిన ఆవశ్యకత ఉందన్నారు.

'రోజువారీ కార్యక్రమాల వివరాలు

- 17న మానవహారం, పరిశుభ్రతపై మెగా డ్రైవ్, ఆరోగ్య సంరక్షణ సేవలు
- 18న స్వచ్ఛత పరుగు, బ్లీచింగ్, దోమల నివారణ మందుల పిచికారీ, నీరు నిలిచిపోయే ప్రదేశాలను శుభ్ర పరచడం, పారిశుధ్య కార్మికులకు ప్రథమ చికిత్స శిక్షణ
- 19న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞ, దంపల గుర్తింపు తొలగింపు, పారిశుధ్య కార్మికులను గుర్తించి వారికి మంజూరైన పథకాలతో అనుసంధానం
- 20న మొక్కల పెంపకం,
- 21న అవగాహన ప్రచారాలు, ర్యాలీలు, పరిశుభ్రత డ్రైవ్, పార్కులను శుభ్రపరచడం, నిర్వహణ, అభివృద్ధి, పీపీఈ కిట్లు, సేఫ్టీగేర్లు పంపిణీ
- 22న మిషన్ లైఫ్ ప్రచారాలు, కాలువలు, డ్రైన్లను శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాలకు ఆరోగ్య పరీక్షల నిర్వహణ,
- 23న వర్షపు నీటి నిల్వ, నిర్మాణాల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు, రహదారుల శుభ్రత
- 24న తాగునీటి నిర్మాణాల శుభ్రత, నిర్వహణపై అవగాహన ప్రచారాలు, నీటి నమూనాలను పరీక్షించడం, భద్రత, వ్యక్తిగత రక్షణపై సఫాయి మిత్రల అవగాహన
- 25న వీధి నాటకాలు, మార్కెట్ ప్రాంతాలను శుభ్రపరచడం,
- 26న అవాంఛిత యాప్‌లను క్లియర్ చేయడం, సైబర్, డిజిటల్ స్వచ్ఛత, సంస్థాగత భవనాలు శుభ్రపరచడం, పిల్లల సంరక్షణ
- 27న గ్రామ, వార్డు సభల నిర్వహణ, ప్రభుత్వ ఖాళీ స్థలాల సుందరీకరణ, టూరిస్ట్ పాయింట్లు, వీధుల పరిశుభ్రత డ్రైవ్‌లు, 28న సాలిడ్ వేస్ట్ మెనేజ్‌మెంట్ ఆస్తుల సుందరీకరణ, పునర్వినియోగానికి పనికొచ్చే ఇ-వ్యర్థాల సేకరణ,
- 29న చెత్తను సృష్టించే ఆర్ట్ శానిటేషన్ పార్కులపై అవగాహన 30న మూలాల విభజన, రీసైక్లింగ్ పద్ధతులు, కంపోస్టింగ్‌పై ప్రదర్శనలు, కమ్యూనిటీ బేస్డ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అవగాహన డ్రైవ్‌లు, ఆరోగ్య బీమా నమోదులో సహకారం వంటి కార్యకలాపాలు
- అక్టోబరు 1న విద్యాసంస్థల్లో స్వచ్ఛ వ్యాకథాన్ల నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రపరచడం, శానిటేషన్ కార్మికులు, ఇతరుల గుర్తింపు, సన్మాన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా పేలి అగ్నిప్రమాదం

- 12 నాటుకోళ్లు, 4 ఫ్యాన్లు, బియ్యం ఆహుతి


ప్రమాదంలో కాలిపోతున్న నాటుకోళ్ల షెడ్

వేపాడ: మండలంలోని ఆకులసీతంపేట గ్రామంలో సోమవారం తెల్లవారుజామున 2 గంటలసమయంలో బాణసంచా పేలుళ్లతో జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక పాక, కోళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఇందుకు సంబంధించి ఇన్‌చార్జి తహసీల్దార్ సన్యాసినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా కాల్చిన బాణసంచా రవ్వలు పడి ముదారపు ఈశ్వర్రావు పాక అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో 12 నాటు కోళ్లు, నాలుగు ఫ్యాన్లు, వంటపాత్రలు, టేకు కలప 25 కేజీల బియ్యం కాలి పోయినట్లు ఆయన చెప్పారు. సుమారు రెండు లక్షలు ఆస్తినష్టం జరిగి ఉంటుందని అభిప్రాయ పడ్డారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే వీఆర్‌ఓ వి.శ్రీను తదితరులు వచ్చి సంఘటానా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన నివేదికను తహసీల్దార్‌కు అందజేసినట్లు వీఆర్‌ఓ తెలిపారు.

ఫీడర్ అంబులెన్స్‌లో ప్రసవం


అంబులెన్స్‌లో ప్రసవం పోసి బిడ్డను తల్లికి అప్పగించిన సిబ్బంది

శృంగవరపుకోట: మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ కొండప్రాంతంలో ఉన్న శనగపాడు గ్రామానికి చెందిన జన్ని సన్యాసమ్మ ఫీడర్ అంబులెన్స్‌లో ఆదివారం రాత్రి బిడ్డను ప్రసవించింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సన్యాసమ్మ ప్రసవ నొప్పులతో ఇబ్బంది పడుతుండగా ఆదివారం రాత్రి 11గంటల సమయంలో హెల్త్ అసిస్టెంట్ తాతారావుకు ఫోన్ చేశారు. దీంతో తాతారావు ఫీడర్ అంబులెన్స్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఫీడర్ అంబులెన్స్ ఈఎంటీ దాలిబాబు శనగపాడు వెళ్తుండగా, అప్పటికే బంధువులు ఆమెను డోలీలో మెట్టపాలెం వరకూ తీసుకొచ్చారు. అంబులెన్స్‌లో ఎక్కించి ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా బొడ్డపాడు వద్దకు వచ్చేసరికి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ ఆపి సిబ్బంది ఆమెకు పురుడు పోయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీపిల్లలను ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి అబులెన్స్‌ను తరలించారు.

మతసామరస్యానికి ప్రతీక ఈద్ మిలాద్ ఉన్ నబీ


విజయనగరంలో ముస్లిం సోదరుల ర్యాలీ


పార్వతీపురం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

విజయనగరం క్రైమ్: మతసామరస్యానికి ప్రతీకగా ఈద్ మిలాద్ ఉన్ నబీ పండగ ప్రశాంతయుతమైన వాతావరణంలో ముగిసిందని ఎస్పీ వకుల్ జిందల్ పేర్కొన్నారు. జిల్లాలో ఈద్ పండగ నేపథ్యంలో ముస్లిం సోదరులు చేపట్టిన ర్యాలీలు ఆద్యంతం భక్తి భావాన్ని చాటిచెప్పాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జిల్లా పోలీసుశాఖ పటిష్ఠ చర్యలు చేపట్టింది. పట్టణంలోని అబాద్ వీధి నుంచి ప్రారంభమైన ర్యాలీ కోట జంక్షన్, సింహాచలం మేడ, బాలాజీ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ రోడ్డు, కన్యకపరమేశ్వరి ఆలయం, గంటస్తంభం, పైడితల్లి అమ్మవారి ఆలయం, మూడు లాంతర్లు మీదుగా తిరిగి ఆబాద్‌వీధికి చేరుకుంది. ర్యాలీలో సుమారు 1500 మంది ముస్లిం సోదరులు పాల్గొన్నట్లు ఎస్పీ తెలిపారు. బందోబస్తులో వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, ఎస్సైలు ప్రసన్నకుమార్, నరేష్, హరిబాబునాయుడు, సుదర్శనరావు, సూర్యకుమారి, దుర్గాప్రసాద్, వీరజనార్దన్, చిన్నారావు, లోవరాజు, శంబంగి రవి, ఎ.మహేశ్వరరాజు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుడి సజీవ దహనం


వృద్ధుడు పెంట చిన్నినాగు

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామంలో ఆదివారం రాత్రి ఓ వృద్ధుడు సజీవ దహనమయ్యాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పెంట చిన్ననాగు(74) భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆయనకు బీడీ తాగే అలవాటు ఉండడంతో ఎప్పటిలాగే ఆదివారం రాత్రి 8.30 గంటల సమయంలో మంచంపై నిద్రిస్తూ బీడీ తాగి కాలుతున్న బీడీని నిద్రమత్తులో మంచంపై పెట్టాడు. మంచం పట్టి ప్లాస్టిక్ కావడంతో బీడీనిప్పు అంటుకుని మంటలు వ్యాపించిమంచం కాలిపోవడంతో దానిపై పడుకున్న వృద్ధుడి తల నుంచి కాళ్ల వరకూ శరీరమంతా కాలిపోయింది. దీంతో అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడికి ఇద్దరు మగపిల్లలు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని భార్య సూరీడమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీఎస్.మూర్తి చెప్పారు.

మూడు నెలల్లో 3 చైన్ స్నాచింగ్స్

- ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తున్న దొంగలు

వీరఘట్టం: మండలంలో ఆగంతుకులు పల్సర్ బైక్‌పై వస్తూ ఒంటరి మహిళలను టార్గెట్ చేసి వారి మెడలో ఉన్న బంగారం చైన్లు తెంచుకుని పోతూ దొరక్కుడా తప్పించుకుంటుండడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. రోడ్డుపై బస్సుల కోసం ఒంటరిగా నిరీక్షిస్తున్న మహిళలు, పొలాలకు వెళ్లే వారిని గమనిస్తూ వారి మెడలో ఉండే బంగారం చైన్లు, పుస్తెల తాళ్లు చాకచక్యంగా తెంపి పారిపోతూ సవాల్ విసురుతున్న ఆ దొంగలు ఎవరో తెలియక పోలీసులకు తలనొప్పిగా మారింది. ఈ ఏడాది జూన్ 21న సీఎస్‌పీ రహదారిలో పాపంపేట జంక్షన్ వద్ద ఒంటరిగా ఉన్న తైలాడ తవిటమ్మ మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు చైన్‌ను ఆగంతుకులు తెంపుకుని పోయారు. తర్వాత ఆగస్టు 3న వండవ జంక్షన్ వద్ద అవదూత మల్లీశ్వరి అనే మహిళ మెడలో ఉన్న 1.50 తులాల బంగారు చైన్ తెంచి పారిపోయారు. తాజాగా సోమవారం నడిమికెల్ల గ్రామానికి చెందిన యామక గౌరమ్మ ప్రకృతి వ్యవసాయ పనుల కోసం చిట్టపులివలస గ్రామం వెళ్లింది. ఆమె రాకను గమనిస్తూ వస్తున్న ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు పుస్తెల తాడును తెంపి పారిపోవడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ విషయం తెలిసిన వెంటనే వీరఘట్టం ఎస్సై జి.కళాధర్ చిట్టపులివలస గ్రామానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు.

అప్రమత్తంగా ఉండాలి

పొలాలకు వెళ్లే, రోడ్లపై బస్సుల కోసం ఎదురుచూసే, వాకింగ్‌కు ఒంటరిగా వెళ్లే మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు.అనుమానం వస్తే వెంటనే డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం బాధితురాలు గౌరమ్మ నుంచి ఆగంతుకుల ఆనవాళ్లు తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.